క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా శనివారం కింద కనపరిచిన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని కడప టౌన్-2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఘన నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి సేవలను కొనియాడారు. సీపీఎం అఖిల భారత కార్యదర్శిగా, పార్లమెంటులో సీపీఎం పక్ష నాయకులుగా, భారతీయ సమాజంలోని వైరుధ్యాలను మార్క్సిస్టు శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి, భిన్నత్వంలో ఏకత్వం భారతీయ భావనకు మాత్రమే దేశ ప్రజల మద్దతు ఉంటుందని ధైర్యంగా తన రచనలు కొనసాగించిన మేధావి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, సీపీఎం కడప నగర నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

కడప ఎడ్యుకేషన్: దువ్వూరు మండలం చల్లబసాయపల్లెలోని 'గ్రామీణ ప్రజా చైతన్య గ్రంథాలయం' వ్యవస్థాపకులు ఎస్.ఆర్.ప్రతాప్‌రెడ్డి సుమారు 200 పుస్తకాలను శుక్రవారం సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్. రమేష్ రావు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన గ్రంథాల్లో 'అమ్మమ్మగారి ఊరు', 'కథ మరిచిన మనిషి', 'నల్లమల రత్నాలు'(నానీలు), 'పల్లెలు నాడు నేడు', 'విజయరాఘవ శతకం' 'దేశ భాషలందు తెలుగు లెస్స', 'సింహ గర్జన', 'దండెం', 'గోదావరి నానీలు', 'తొలకరి మెరుపులు', 'వజ్రాల బేహారి', జీవన దర్శనం' లాంటి పలు విలువైన గ్రంథాలున్నాయన్నారు.

మంచి, చెడు స్పర్శలపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలికలు, యువతులు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండడంతోపాటు ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు సాగాలని జిల్లా మిషన్ శక్తి కో ఆర్డినేటర్ శోభారాణి తెలిపారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ అధికారి ఆదేశాల మేరకు మిషన్ శక్తి స్కీం కింద మహిళా సాధికారత-సంకల్ప్‌పై పది రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కడప నగరంలోని గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూలులో విద్యార్థినిలకు పలు అంశాలపట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రదానంతో అంధ రహిత సమాజం నిర్మిద్దాం



నేత్రదాత కుటుంబ సభ్యులకు అమర్ రహే జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ మాధవీలత

కడప రూరల్ : నేత్రదానంతో అంధ రహిత సమాజం నిర్మిద్దామని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ మాధవీలత పేర్కొన్నారు. 40వ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో కడప జిల్లా కేంద్రం లోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్ మాధవి లత, రాజు, ఆర్గాన్ డొనేషన్ అన్నమయ్య జిల్లా చైర్మన్ కొత్త సుదర్శన్ ల చేతులమీదుగా కడప, అన్నమయ్య జిల్లాల లో నేత్రదానం చేసిన నేత్రదాత కుటుంబ సభ్యులకు నేత్ర దాత అమర్ రహే జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి లత మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేసి అంధత్వం తో బాధ పడుతున్న అంధుల కు చూపు ఇచ్చి ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యం నేత్రదానం అన్నారు. ఈ పుణ్యకార్యాన్ని మనందరం నేత్రదానం చేసేందుకు అవగాహన కలిగి, కల్పించి అంధ రహిత సమాజం నిర్మిద్దాం అని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నేత్రదానం చేసిన నేత్రదాత కుటుంబ సభ్యులు, హర్ష కుమార్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి కోశాధికారి అనీల్, సభ్యులు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు, నెల్లూరు జట్ల భారీ స్కోరు



సాయి గణేష్, కర్నూలు (97 పరుగులు)



ప్రమోద్ కుమార్, అనంతపురం (5 వికెట్లు)



అక్షిత్ రెడ్డి, కర్నూలు (4 వికెట్లు)



తేజరెడ్డి, చిత్తూరు (78 పరుగులు)



అఖిల్, నెల్లూరు (5 వికెట్లు)



మాధవ్, నెల్లూరు (82 పరుగులు)



రెడ్డి ప్రకాశ్, చిత్తూరు (4 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు రెండవ రోజు కొనసాగాయి. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ కొనసాగుతున్నది. శుక్రవారం 222 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 93.3 ఓవర్లకు 410 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి గణేష్ 97 పరుగులు, కనిష్ 43 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ అద్భుతంగా చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ చేసి 5 వికెట్లు, షేక్ కమిల్ 3 వికెట్లు, తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన అనంతపురం జట్టు 24 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. ఆ జట్టులోని జయంత్ 34 పరుగులు, ఎంకె దత్త రెడ్డి 27 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అక్షిత్ రెడ్డి 4 వికెట్లు, సాబ్‌జాన్ బాష 3 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు ఇంకా 296 పరుగుల వెనుకంజలో ఉంది, దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీసీ క్రికెట్ స్టేడియంలో...

అదే విధంగా వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు-చిత్తూరు జట్లు తలపడుతున్నాయి. రెండవ రోజు 407 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన నెల్లూరు జట్టు 105.2 ఓవర్లకు 554 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మాధవ్ 82 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని రెడ్డి ప్రకాశ్ 4 వికెట్లు, అచ్యుతనంద 3 వికెట్లు, ముకేష్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని తేజరెడ్డి 78 పరుగులు, జెనిక్ దాస్ 33 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని అఖిల్ 5 వికెట్లు, మాధవ్ 3 వికెట్లు, తీశారు. అనంతరం నెల్లూరు జట్టు రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 1 ఓవర్ వికెట్ కోల్పోకుండా 2 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 345 పరుగుల ఆధిక్యంలో ఉంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి

కడప కోటిరెడ్డిసర్కిల్ : సీతారాం ఏచూరి, జ్యోతిబసు, హరికిషన్ సింగ్ సుర్జిత్ లాంటి భవిష్యత్ దర్శనం చేయగలిగిన నాయకులు భౌతికంగా దూరం కావడం దేశానికి తీవ్రమైన లోటు అని బీమా ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి తెలిపారు. కడప నగరంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి తొలి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీతారాం ఏచూరి ఇన్సూరెన్స్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో తమకు సంఘీభావంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అక్బర్ బాషా, ఇతర నాయకులు అమీనా పర్వీన్, శశికళ, రాజు, కుమార్, హనుమ పాల్గొన్నారు.

వెజిటబుల్స్ డే



కూరగాయలతో విద్యార్థులు, పాఠశాల వైస్ చైర్మెన్ సాయిసుధీర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్: కడప అక్కాయపల్లె సాయిబాబా ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం వెజిటబుల్స్ డేను జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ చైర్మెన్ సాయి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వెజిటబుల్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియచేయాలనే ఉద్దేశ్యంతోనే వెజిటబుల్స్ డే నిర్వహించామన్నారు. ఏ కూరగాయల్లో ఏ విటమిన్ లభిస్తుందనే విషయాన్ని పిల్లలకు వివరించామన్నారు. పిల్లల ఆరోగ్యం కోసం ఎలాంటి ఆహార అలవాట్లు చేసుకోవాలనే విషయాన్ని తెలియ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌చార్జి ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప అంగడివీధి పాఠశాలకు చెందిన విద్యార్థులు వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో భాగంగా అండర్ -17 స్విమ్మింగ్‌లో ఈశ్వర్, మనోజ్‌లు, అండర్ -14 సైక్లింగ్ బాయిస్ పోటీల్లో జశ్వంత్‌కుమార్‌రెడ్డి, బాలికల పోటీలో బీబీ మరియమ్‌లు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పసుబడి సుజాత, క్రీడా ఉపాధ్యాయుడు రాచకుంట అగ్గిరప్పలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు.

జాతీయ భాష హిందీ ఎంతో అవసరం



మాట్లాడుతున్న జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు వివేకానంద రెడ్డి

కడప ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగంలో హిందీని అధికార భాషగా స్వీకరించిన రోజు సెప్టెంబర్ 14 అని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు వివేకానంద రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఈ తీర్మానం ఆమోదమైందనీ, హిందీ భాష ప్రాముఖ్యతను గుర్తుచేయడం, అధికారిక పనుల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడమన్నారు. ఇంచార్జి సంధ్య ,ఉపాధ్యాయులు కుమారి, సునీత పాల్గొన్నారు.

అంత్యక్రియల ఖర్చులకు రూ. 15 వేలు ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: చనిపోయిన అంగన్వాడీలకు ఆరోజే అంత్యక్రియల ఖర్చులకోసం రూ. 15 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజుపాలెం మండలం ఉప్పలపాడు అంగన్వాడీ సెంటర్లో కార్యకర్తగా పనిచేస్తున్న సరస్వతి చనిపోయిందన్నారు. ఆమె అంత్యక్రియల ఖర్చులకు డబ్బులు ఇవ్వాల్సి ఉండగా ఐసీడీఎస్ సిడిపిఓ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అడిగితే డబ్బులు వచ్చినప్పుడు ఇస్తామని చెప్పడం సరి అయింది కాదన్నారు.

బీసీలకిచ్చిన హామీలు అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, వెనుకబడిన తరగతులైన బీసీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు పరచాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి బీసీల ఐదు ప్రధాన డిమాండ్లపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడి ఉన్న బీసీలకు ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్లు ×ప్రత్యేక రక్షణ చట్టంతెస్తామని ఎన్నికల వాగ్దానం చేశారన్నారు. ఏడాదిన్నర గడుస్తున్నా ఈ ప్రభుత్వం ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. అలాగే చట్టసభలలో 33 శాతం , స్థానిక సంస్థలు-నామినేటెడ్ పదవులు-నామినేషన్ వర్క్స్‌లలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరుపుతామని మరో వాగ్దానం చేసి ఉన్నారన్నారు. రాష్ట్రంలో కుల గణనను సమగ్రంగా నిర్వహించకుండా, స్థానిక ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేయకుండా, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు ఎలా అమలు జరుపుతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాజ్యాంగ- న్యాయపర చిక్కులన్నింటినీ అధిగమించి, కూటమి ప్రభుత్వం తప్పక బీసీలకు స్థానిక సంస్థలలో జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలయ్యేలా చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు లింగ మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్ యాదవ్, ముఖ్య సలహాదారులు సుంకేసుల ఖాదర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, నగర అధ్యక్షులు నరసింహం, నగర కార్యదర్శి గొడుగు హరికుమార్, రానా ప్రతాప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, మరియు బీసీ నాయకులు సూరీడు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యం, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న జె. అహరోను

కడప కార్పొరేషన్: కరువు భత్యం, పీఆర్‌సీ, ఐఆర్, క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు జంబారపు అహరోను డిమాండ్ చేశారు. శుక్రవారం గుంతబజారులోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం బకాయిలు వెంటనే చెల్లిస్తోందన్నారు. కేంద్రం తమ ఉద్యోగులకు కరువు భత్యం చెల్లించుచున్నప్పుడు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా చెల్లించాలని ఇదివరకే ఒక ఒడంబడిక ఉండిందన్నారు. ఆ ఒడంబడికను ప్రభుత్వం ఖాతరు చేయలేదన్నారు. సంవత్సరాలు గడిచిపోతున్నా కరువు భత్యం ఇవ్వడం లేదన్నారు. ఇవి ఆలస్యం కావడం వల్ల రిటైర్ అయిన ఉద్యోగులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనేక రోగాలకు గురై తీవ్ర అనారోగ్య స్థితికి పోయి ఆర్థిక ఇబ్బందులతో ఇంకనూ బాధపడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే బకాయి ఉన్న కరువు భత్యం వెంటనే మంజూరు చేయాలని, పీఆర్‌సీ వెంటనే విడుదల చేసి, కమిటీ వేయాలన్నారు. పీఆర్‌సీ వేసేలోపు ఇంటీరియమ్ రిలీఫ్ 30 శాతం ఇవ్వాలన్నారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు పాత పద్ధతి ప్రకారంగానే పెన్షన్‌ను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సి. గంగన్న, జిల్లా కోశాధికారి సి. నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఘన సన్మానం



ఆర్ఐ వీరేష్ బదిలీపై వెళుతుండగా సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: జిల్లా పోలీస్ శాఖకు ఆర్ఐ జి.వీరేష్ అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న వీరేష్‌ను ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య , ఆర్ఐలు శివరాముడు, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐ పాల్గొన్నారు.



ఏఆర్ అదనపు ఎస్పీగా బదిలీపై వెళుతున్న శ్రీనివాస రావును సత్కరిస్తున్న జానమద్ది విజయభాస్కర్

కడప అర్బన్: పోలీసు వృత్తిలో అంకిత భావం కలిగి, రచన వ్యాసంగం ప్రవృత్తి కలిగి రచయితగా కవిగా నిబద్ధత కలిగిన వ్యక్తి కొల్లూరు శ్రీనివాస్ రావు అని జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. పదోన్నతి పై ఏఆర్ అదనపు ఎస్పీగా ఒంగోలుకు బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్ రావును శుక్రవారం జానమద్ది సాహితీ పీఠం తరపున సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో జానమద్ది ప్రసంగిస్తూ కవిగా గేయ రచయితగా శ్రీనివాస్ రావు ఎన్నో పాటలు రాశారని, తనదైన శైలిలో సాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి గునిశెట్టి సాయికుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



చెక్కును అందచేస్తున్న ఆర్.వి. టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి. రమణ

కడప ఎడ్యుకేషన్ : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషిచేస్తానని ఆర్.వి. టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి. రమణ పేర్కొన్నారు. శుక్రవారం పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో రాణించిన విద్యార్థినుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.వి. రమణ క్రీడల అభివృద్ధికి తనవంతుగా రూ.1 లక్షను విరాళంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్ దాత ఆర్.వి. రమణకు ధన్యవాదాలు తెలిపారు. వివేకానంద క్లాత్ మార్కెట్ మాజీ అధ్యక్షుడు చిన్నపరెడ్డి మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరంలో పదోతరగతిలో ప్రథమస్థానం సాధించే విద్యార్థికి రూ. 10వేలు నగదు అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు బొగ్గేటి శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవిశంకర్, గౌస్, దశరథరామిరెడ్డి, తేజోవతి పాల్గొన్నారు.

నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జి దేవరాజ్

కడప ఎడ్యుకేషన్: యువత నేతాజీ సుభాష్ చంద్ర బోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జి దేవరాజ్ పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి బ్లాక్ 9వ జాతీయ మహాసభలు కడప నగర వేదికగా శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహావీర్ సర్కిల్ నుండి ఎర్రముక్కపల్లి సంధ్యా సర్కిల్ మీదుగా జిల్లా పరిషత్ వరకు ర్యాలీగా వచ్చి, జిల్లా పరిషత్ దగ్గర బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను విద్యార్థులకు అంగడి సరుకులా మార్చిందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ విధానంలో కొనసాగుతోందని, దీనివల్ల దేశ అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని, ప్రతి ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తానని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను విద్యార్థులను నరేంద్ర మోడీ ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దేశాన్ని నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి సుందరరామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి సర్కార్ రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పక్కన పెట్టి, సంవత్సరం పాలనలో ఏదో పెద్ద ప్రగతి సాధించినట్లు వేడుకలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పడం సిగ్గుచేటని, వెంటనే ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలు కొనసాగేలా చూడాలని, లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ జాతీయ అధ్యక్షుడు డాలర్, జయవర్ధన్, తేజ్ దీప రెడ్డి ,రాజు గొల్లపల్లి ,రాజ శేఖర్ గౌడ్, పాపిరెడ్డిపల్లి పృధ్వి, సగిలి రాజేంద్రప్రసాద్, పోతులయ్య, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన



ఇందిరా నగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: పరిసరాల పరిశుభ్రత తోనే దోమలను నిర్మూలించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఇందిరా నగర్ లో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమం ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులకు పరిసరాల పరిశుభ్రత, దోమల నిర్మూలన పై అవగాహన కల్పించారు. నీరు నిలువ కారణంగా దోమలు పుట్టుకొస్తాయని తెలిపారు. ఫలితంగా జ్వరాలు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నిర్మూలించవచ్చని, మెరుగైన ఆరోగ్య సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా దోమ లార్వా పెరగకుండా మస్కిటో ఆయిల్ బాల్స్‌ను నీరు నిల్వ ప్రదేశాలలో వదిలారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మానస, ఖాజా మొహిదీన్, వెంకటరెడ్డి, నాగలక్ష్మి రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకుని హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు ఆహార పదార్థాల తయారీలో నాణ్యతను, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత ఆదేశించారు. శుక్రవారం ఈ మేరకు ఆమె పలు హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ నగరంలోని మురళి హాల్ సమీపంలోని సౌజన్య హోటల్‌లో ఆహార నాణ్యత బాగోలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో కలిసి అకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. హోటల్ భవన సామర్థ్యం, ఆహార తయారీ నియమాలు, కస్టమర్లకు అందిస్తున్న సేవలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు బాగోలేకపోవడం, శుభ్రత లోపించడం పట్ల నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. 15 రోజుల్లోపు పరిస్థితుల్లో మార్పు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కడప నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లపై ఫిర్యాదులు చేస్తే తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరును ప్రారంభిస్తున్న 30వ డివిజన్ కార్పొరేటర్ షఫీ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని బాదుల్లా మకాన్ వీధిలో అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ అభ్యర్థన మేరకు కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి నిధులతో బోరు మంజూరు చేశారు. ఇటీవల బోరు వేయగా అందులో మంచినీరు పడటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ బోరును కార్పొరేటర్ షఫీ ప్రారంభించి మాట్లాడుతూ తాను అడిగిన వెంటనే బాదుల్లా మకాన్ వీధిలో బోరు మంజూరు చేసిన ఎంపీ అవినాష్‌రెడ్డికి సహకరించిన మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు అల్లాబకాష్, అర్షద్, చాన్‌బాషా, బాషా, సొహైల్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు ఫైరోజ్, ఫారూఖ్, సుల్తాన్, బాబా, ఫిట్టర్ శివకొండయ్య పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి



సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఇందిరా నగర్, వికలాంగుల కాలనీ, ఫక్కీరుపల్లె, ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండ్ల చుట్టుప్రక్కల గుంతల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, వార్డుల్లో ఎన్నెన్ని ఫీవర్ కేసులు ఉన్నాయో తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సెక్రటరీలను ఆదేశించారు. అదనపు కార్మికులను సమన్వయం చేసుకొని పారిశుధ్య పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. వార్డుల్లో ఖాళీ స్థలాలను గుర్తించి అందులో చెత్త, మురికి పేరుకుపోకుండా సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి



ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డికి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది. ఆయన ప్రిన్సిపాల్‌గా పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళుతున్నారు. ఈ సందర్భంగా కడప ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి, అధ్యాపకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రాజారావు, అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, దక్షిణామూర్తి, హబీబుల్లా, శ్రీరాములరెడ్డి, చంద్రమౌళి, పద్మావతి, అమృతరాజు, రోజమ్మ, యోగీశ్వర్ రెడ్డి, సుధాకర్, రాజా, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత రణభేరిని జయప్రదం చేయాలి



దళిత రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గుర్రప్ప తదితరులు

కడప రూరల్ : ఈనెల 24వ తేదీన నిర్వహించే దళిత రణభేరిని జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప తెలిపారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంతరం దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఈనెల 24వ తేదీన నిర్వహించే దళిత రణభేరిని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబయ్య, జయరాం, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్ వద్ద ఉన్న మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ పక్వాడ నినాదం సందర్భంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ విలాయత్ అలీ బేగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్-ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ ఒమర్ ఫరూక్, ముహమ్మద్ సికందర్ హుస్సేన్ , అధ్యాపకులు డాక్టర్ అష్రఫ్, నాసర్ ఆయూబ్, ఖాజా మొయినుద్దీన్, డాక్టర్ పాండు కుర్రె, షరీఫ్, ఖాజపీర్, అయజుద్దీన్ ఫమిద, రుక్సన, తస్లీం, ముబారక్, అబుబకర్, అక్బర్, సోహైల్ , నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం



లోకేష్ తల్లికి చెక్కును ఇస్తున్న బాలాజీరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైద్య విద్యను అభ్యసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థికి బాసట స్వచ్ఛంద సంస్థ ఆర్థికసాయం అందించింది. కడప నగరానికి చెందిన లోకేష్ రేణిగుంట శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీలో మెడిసిన్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందుల తరుణంలో లోకేష్ తన తల్లితో కలిసి బాసట ప్రతినిధులు బాలాజీ రావు, డీపీ కార్తీక్ రెడ్డిలను కలిసి సమస్యలను తెలియజేశారు. దీంతో బాసట సభ్యులైన డాక్టర్ రితేష్ రెడ్డి, డాక్టర్ రాహుల్ రామిరెడ్డిలు స్పందించి రూ. 10 వేలు అందజేశారు.